క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



గోవిందరావుపేట : మండలంలోని పస్రా గ్రామంలో వారం క్రితం అంబాల బాబు అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మడిపెల్లి శ్యాంబాబు మాదిగ పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో తిక్క దుర్గారావు, పసుల భద్రయ్య, సుంచు యాకోబ్, మునిగాల సాంబయ్య, వేల్పుల దుర్గ ప్రశాంత్, పురుషోత్తం సమయం, తిప్పనిపల్లి సురేష్, గడ్డం లడ్డు, అంబాల గోవర్ధన్ ఉన్నారు.

మంచు కురిసే వేళలో..



వెంకటాపురం(కె): స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో శనివారం తెల్లవారుజామున కురుస్తున్న మంచు చూపరులను ఆకట్టుకుంది. తెల్లవారుజామున శివాలయం రోడ్డు, మార్కెట్ యార్డు రోడ్డులో మంచు దుప్పటిలా అలుముకుని ఉంది. ఈ దృశ్యం ప్రజలకు కనువిందు చేసింది.

రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం



వెంకటాపురం(కె): మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం చేయాలని మాదిగ జేఏసీ ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం రమేశ్ అన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో మాదిగ జెఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాదిగలపై అనుసరిస్తున్న ద్వంద నీతికి నిరసనగా మాదిగ సంఘాల జెఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోకల అంజి, రాంబాబు, నాగర్జున, శ్రీరామ్మూర్తి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కొటాల జాతరకు తరలిరావాలి

కాటారం: కొంరంభీం ఆసిఫాబాద్ జిల్లా కొటాల మండలంలో నేడు(ఆదివారం) జరిగే కొటాల మహాజాతరకు మేదరి కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మేదరి కులస్తుల ఆరాధ్య దైవాలైన స్వయంభూ శ్రీ కేతేశ్వర స్వామి, కంకాలమ్మ అమ్మవార్ల జాతరను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో వస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని మేదరి కుల బాంధవులు అందరు జాతరకు తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామానికి చెందిన బొట్ల మొగిలి, ఒడితల గ్రామానికి చెందిన నన్నూట పెద్ద శంకరయ్య, చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన గూడేపు చిన్న తిరుపతి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ గొర్రె సాగర్ శనివారం పరామర్శించారు. అలాగే జడలపేట గ్రామానికి చెందిన బండారి రవీందర్ ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఈ- కేవైసీ తప్పనిసరి

శాయంపేట : గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డు ఈ–కేవైసీ చేసుకోవాలని ఆదిరెడ్డి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు దుంపల తిరుపతిరెడ్డి కోరారు. గ్యాస్ కనెక్షన్ పొందివున్న ప్రతిఒక్కరూ ఆధార్ కార్డు లింక్ చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి వేలిముద్ర వేయాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. గ్యాస్ కనెక్షన్ బుక్కుతో పాటు ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని కోరారు. ఈ–కేవైసీ చేసుకోని పక్షంలో గ్యాస్ పంపిణీ నిలిచిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు

- జంపన్నవాగు నుంచి అర్ధరాత్రి ఇసుక రవాణా
- పట్టించుకోని అధికారులు



జంపన్నవాగులో ట్రాక్టర్లు

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం జంపన్నవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళలో అధికారుల అనుమతి లేకుండా వాగులో నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. భారీగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల కళ్లు కప్పి కొంతమంది దళారులు వాగులో నుంచి ఇసుక తరలించి సొమ్ము చేసుకునేందుకు రాత్రివేళలో వాగులో ఇసుక తోడేందుకు తెర లేపారని ఆ ప్రాంత ప్రజలు బహాటంగా చెబుతున్నారు.

కూలీల సాయం లేకుండానే...

వాగులో నుంచి కూలీల సాయం లేకుండానే ఇసుక తరలింపునకు దళారులు ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు. ట్రాక్టర్ వెనుక జేసీబీ బకెట్‌లా ఒకటి తయారు చేసి ట్రాక్టర్ వెనకాల అమర్చి దాంతో ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్నారు. జంపన్నవాగులోని ఇసుక నాణ్యతగా ఉండడంతో డిమాండ్ ఉంటుంది. స్థానికంగా ఇళ్ల నిర్మాణాలకు, ఇతర పనులకు ఒకటి, రెండు ట్రిప్పులు ఇసుక కూలీలతో ట్రాక్టర్ల తీసుకోవడాన్ని ఎవరూ కూడా పట్టించుకోరు. ఎక్కువ మొత్తంలో అవసరాలకు ఇసుక కావాలంటే రెవెన్యూ అధికారుల అనుమతితో ఇసుక తరలించాల్సి ఉంటుంది. కానీ మేడారం జంపన్నవాగు నుంచి అర్ధరాత్రి సమయంలో ఇసుక తరలించడం వెనుకల మతలబేట్టిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జంపన్నవాగులో పట్టా ఉందని కూడా ఇసుక తరలిస్తున్నారు. ఒక వేళ జంపన్న వాగులో తోడే ఇసుక ప్రాంతం పట్టా భూమి కలిగి ఉంటే సదరు వ్యక్తులు రెవెన్యూ అధికారుల నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాల్సి ఉంది. పట్టా ఉందని సాకుగా చూపుతూ రాత్రివేళ అక్రమంగా ఇసుక తరలించడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానిక అవసరాలకు ప్రజలు ఇసుక తరలిస్తే పట్టుకుని కేసులు పెట్టడంతో పాటు జరిమానా విధిస్తున్న అధికారులు వాగులో నుంచి అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

స్నానఘట్టాల మెట్లపై నుంచి తరలింపు

వాగులో ఇసుక తరలింపు కోసం స్నానఘట్టాల మెట్లపై ట్రాక్టర్లు ఇసుక లోడుతో వెళ్లడంతో స్నానఘట్టాల మెట్లు కూడా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోకపోవడంతో వాగులో నుంచి ఇసుక తరలింపునకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. గత కొద్దిరోజుల నుంచి రాత్రి సమయంలో ఇసుక దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఎన్నికల బిజీలో ఉండడాన్ని అదునుగా భావించి ఇసుక తరలింపునకు దళారులు పూనుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక తరలిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే వాగులో ఇసుక ఖాళీ కానుంది. వాగులో నుంచి ఇసుక తరలింపు విషయంపై ఆర్ఐ సునీల్‌ను అడగగా తమ దృష్టికి రాలేదని, ఎవరికి కూడా అనుమతి ఇవ్వలేదన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

మంత్రిని కలిసిన తుడుందెబ్బ నాయకులు



మంగపేట : మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రాన్ని ఇస్తున్న తుడుందెబ్బ నాయకులు

మంగపేట : నూతనంగా పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీతక్కను తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు వట్టం ఉపేందర్, కబ్బాక శ్రావన్‌కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తూరు–మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని తొండ్యాల లక్ష్మీపురం గ్రామాన్ని గ్రామపంచాయతీగా ప్రకటించాలని వినతి త్రాన్ని అందచేశారు. కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ గ్రామానికి 09 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాలనా వ్యవస్థ పూర్తిగా మందగించిందన్నారు. ఈ విషయంపై స్పందించి గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీగా ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పరిపాలనా సౌలభ్యంలో భాగంగా రాజుపేటను నూతన మండలం చేయాలని మంత్రి సీతక్కను కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూర్క యాదగిరి, సత్యం ఏఎస్‌యు రాష్ట్ర అధి కార ప్రతినిధి చందా మహేష్, ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు చిత కృష్ణ, మల్లెల రాము, నాగేశ్వర్‌రావు, సిద్దబోయిన సర్వేశ్ ఉన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు చేయాలి

వెంకటపురం(కె): మండల కేంద్రానికి జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కకు ఆదివాసీ తుడుందెబ్బ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడి పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్ చదవడానికి బయటకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అట్టం మహేందర్ అన్నారు. వెంటనే మండలానికి జూనియర్ కళాశాల ఏర్పాటు చేసే విధంగా చూడాలని పలు డిమాండ్లతో వినతి పత్రం ఇచ్చారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి విద్యాశాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. వారి వెంట రమణ లక్ష్మయ్య, యాదగిరి, గంట సత్యం, మహేష్, అశోక్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు చింత కృష్ణ,మల్లెల రాము, నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

శాయంపేట : పంట పొలాల్లో ఉపయోగించే రసాయని ఎరువుల వినియోగం తగ్గించాలని బీసీఐ ప్రాజెక్టు మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. కాట్రపల్లి, సాధోనిపల్లి గ్రామాల్లో శనివారం విషపూరిత పురుగు మందుల వినియోగంపై ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోనోక్రోటోపాస్, ట్రైజోఫస్, కార్బనిజం లాంటి విషపూరితమైన పురుగు మందులను నిషేధించిందన్నారు. గర్భిణులు పిల్లలకు పాలిచ్చే సమయంలో పురుగు మందు పిచికారికి, పంట చేన్ల వద్దకు వెళ్లొదన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



ఎస్ఎస్ తాడ్వాయి : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



వెంకటాపురం(కె) : జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ప్రత్యేక సోనియాగాంధీ పుట్టినరోజున రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పేదలకు ఉచితంగా రూ. 10లక్షల వైద్య సౌకర్యాం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గౌరవ మండల అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా మహిళ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, జిల్లా మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజన, సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పీరీల్ల వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనివారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, సొసైటీ చైర్మన్ చిడెం మోహనరావు, నాయకులు చిడెం శివ, మన్నెం సునీల్ ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతదేవి, రమేష్ , వేణు, కళాధర్, రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి ఆధ్వర్యంలో సోనియా గాధీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించా రు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య జయరాంరెడ్డితో కలిసి కేక్ కట్‌చేసి పార్టీ కార్యకర్తలు, నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు.

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యుడు, ములుగు వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, మిల్కూరి అయిలయ్య, జంగిలి రవి, మార్క జయ శంకర్, చెన్నోజు శ్రీనివాస్, రాజిరెడ్డి, రమేష్, సాంబయ్య, శివశంకర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మంగపేట: కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నేతలు



వెంకటాపురం (ఎం): కేక్ కట్ చేస్తున్న మల్లాడి రాంరెడ్డి, నాయకులు

గోశాలలకు పశుగ్రాసం అందజేత

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలతసురేష్ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన గోశాలకు హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలం, కన్నూరుకు పుల్లూరు రాంచందర్‌రావు అతడి తల్లి పుల్లూరి సత్తమ్మ జ్ఞాపకార్థం శనివారం పశుగ్రాసాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పశుగ్రాస తరలింపులో సహకరించిన మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాసగాని రమేష్‌ను స్థానిక సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలతసురేష్, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ గౌరవ అధ్యక్షుడు మారం సరోత్తంరెడ్డి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గోవులకు సేవ ఎంతో పుణ్యమని, గోవులకు పశుగ్రాసాన్ని అందించేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. వారి వెంట వెంకట్రావుపల్లి మాజీ ఎంపీటీసీ ఏకు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



పశుగ్రాసాన్ని అందించిన వారిని అభినందిస్తున్న సర్పంచ్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల ఉపాధ్యాయులు శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ముఖ్యమంత్రి విద్యారంగ సలహాదారులు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎస్, 317 జీఓ రద్దు, డీఏ ప్రకటన, బదిలీలు, పదోన్నతులు వంటి సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చిరాములు, ఆరె రాకేష్‌రెడ్డి, కృష్ణ, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ప్రారంభమైన ఉచిత ప్రయాణం



వెంకటాపురం(కె) : ఉచిత బస్సు సేవలను ప్రారంభించిన జెడ్పీటీసీ పాయం రమణ

వెంకటాపురం(కె): ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సేవలను స్థానిక జెడ్పీటీసీ పాయం రమణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చిడెం మోహనరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, రమేష్, బాలసాని వేణు, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీత దేవి, నాయకులు చిడెం శివ, మన్నెం సునీల్, వేల్పూరి సత్యనారాయణ, మద్దుకూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: ఉచితబస్సు ప్రయాణంతో మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇలాంటి సదుపాయం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం

మంగపేట : కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా అమలులోకి తెచ్చిన మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆపార్టీ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విదంగా ఆరు గ్యారెంటీ పథకాల్లో మొట్టమొదటగా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం, రూ.10 లక్షలకు పెంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రారంభించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండల, జిల్లా నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు శిద్దశెట్టి శ్రీనివాస్, నర్సింహారావు, ఆదినారాయణ, సంపత్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల్లో రెండు హామీలను మూడు రోజుల్లోనే అమలు చేసి ప్రజాప్రభుత్వం అని సీఎం రేవంత్‌రెడ్డి రుజువు చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శనివారం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఆయన బస్టాండ్‌లో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ.అయూబ్‌ఖాన్, దేవేందర్, ఎండి.ఖలీల్ ఖాన్, యం.లాలయ్య, వి.నర్సింహారావు, వి.చిన్నఎల్లయ్య, సీహెచ్.బాలరాజు, అరుణ, కె.పోషయ్య, ఎస్.రామయ్య, మధుబాబు, లాల్‌మహ్మద్, కె.రాధిక, బొచ్చు పాల్గొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మీ పథకం మహిళలకు వ రంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించడంతో ఏటూరునాగారం బస్టాండ్‌లో సొంత గ్రామాలకు వెళ్లేందుకు మహిళలు బ్యాగులు సర్దుకుని సంతోషంగా బస్టాండ్‌కు తరలి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం నుంచి పథకం అమలులోకి రావడంతో ఆర్టీసీ బస్సులో మహిళలు ప్రయాణించేందుకు పోటీ పడ్డారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్టాండ్ ప్రాంగణం మహిళలతో కిటకిటలాడాయి. ప్రతి బస్సులో ప్రయాణించే వారిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది. ఏదైనా పనిమీద పురుషులు ఊరికి వెళ్లాల్సి వస్తే మహిళలని రెడీ చేసి పంపిస్తున్నట్లు కనబడుతోంది. మహాలక్ష్మీ పథకం అమలు పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



ఏటూరునాగారం బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు



మంగపేట: ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



ఏటూరునాగారం : జెండా ఊపి ఉచిత బస్సును ప్రారంభిస్తున్న చిటమట రఘు

‘ఉపాధి’ ఉద్యోగుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న ఉపాధి ఉద్యోగులు

ములుగు: ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో జిల్లా కేంద్రంలో ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది శనివారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లా జేఏసీ చైర్మన్ మాలోతు రాజు సమక్షంలో స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 20ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఏపీఓలు, డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ ప్రభుత్వం పర్మనెంట్ చేస్తుందనే నమ్మకం కలుగుతుందన్నారు. మంత్రి సీతక్క తమ ఇబ్బందులను గుర్తించి అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రఘు మాట్లాడుతూ సీతక్క రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం శుభ పరిణామని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, సభ్యులు గోల్కొండ సురేష్, రామయ్య, సర్దార్, శ్రీనివాస్, భాస్కర్, సమ్మయ్య, కవిత, మంజుల, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: చిట్యాల మండలం జడల్‌పేట గ్రామానికి చెందిన బండారి రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు శని వారం జిల్లా కేంద్రానికి చెందిన సంఘమిత్ర ట్రస్ట్ (గుర్రపు కొమురయ్య–రాజమ్మ) స్మారకార్థం ట్రస్ట్ నిర్వాహకులు గుర్రపు రవీందర్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లాలో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కళాశాల ప్రిన్సిపాల్ ఎలుగూరి హరికృష్ణ, సిబ్బంది మొగిలి, నరేష్, రాజు, భాస్కర్ పాల్గొన్నారు.